విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 145 | ఆదివారం 27. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## పాలిచ్చే బర్రెను పక్కకు పెట్టి.. దున్నపోతును తెచ్చుకున్నారు



- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- పని చేస్తున్న ప్రభుత్వం కాళ్లల్లో కట్టెలు పెట్టొద్దనే కేసీఆర్ బయటికి రావట్లేదు
- మూడేళ్లు కేసీఆర్ బయటకు రాకపోయినా ఆదరణ తగ్గలేదన్నారు.
- ఆయన బయటకి కనిపించకపోయినా.. ప్రజల గుండెల్లో భద్రంగా ఉన్నారన్నారు.
- ప్రతి మహిళ, ప్రతి ఆడబిడ్డ ఇవాళ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు
- బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమయానికి రైతుబంధు
- ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిందన్నారు

## సీఈసీ వివాదం.. 30న 'ఇండియా కూటమి' నేతల భేటీ

దిల్లీ::(తెలంగాణ వాణి)

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ఒత్తిడి పెంచే దిశగా విపక్షాలు కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఈ అంశంపై చేపట్టాల్సిన ఆందోళనలపై చర్చించేందుకు ఇండియా కూటమి నేతలు ఈ నెల 30న దిల్లీలో భేటీ కానున్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను సీఈసీ పదవి నుంచి తప్పించాలనే తమ డిమాండ్‌పై పరస్పరం సంప్రదింపులు జరిపి.. ఉమ్మడి నిర్ణయం తీసుకోనున్నారు. ఈ విషయంపై 29న కాంగ్రెస్ ప్రత్యేకంగా సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, జ్ఞానేశ్ కుమార్‌అభిశంసనకు మరోసారి పార్లమెంటు ఉభయ సభల్లో నోటీసులు ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన 73 మంది రాజ్యసభ సభ్యులతో కూడిన ప్రతిపక్ష కూటమి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ అభిశంసన నోటీసు ఇచ్చింది. అది రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. అది అలా ఉండగానే మరోసారి నోటీసు ఇవ్వాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. కాగా.. సర్ ప్రక్రియలో అవకతవకలు, ఇతర సమస్యలపై ఇప్పటికే 23 రాజకీయ పార్టీలు, ఓ



స్వతంత్ర ఎంపీ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను సంప్రదించారు. ఇదీ చదవండి: ఎమ్మెల్యేల రెండు పెళ్లిళ్లంటూ సీఎం వ్యాఖ్యలు.. పేర్లు చెప్పాలని భాజపా

## ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ చేస్తాం: కవిత

హైదరాబాద్:(తెలంగాణ వాణి)



రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం మాటల ప్రభుత్వమేనని.. చేతలు శూన్యమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ ఫామ్‌హౌస్ పేరిట డ్రామాలు అడుతున్నారని మండిపడ్డారు. అంతా లోపాయికారీ ఒప్పందాలేనని.. ఫామ్‌హౌస్‌లపై చర్యలు ఉండవని ఎద్దేవా చేశారు. వచ్చే ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుందని కవిత ప్రకటించారు.

## తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కార స్వరం.. తెలంగాణ సోయికి నిలువెత్తు నిదర్శనం..

హైదరాబాద్:(తెలంగాణ వాణి)



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, బహుజన ఆత్మ గౌరవ ప్రతీక, మనం చాకలి ఐలమ్మగా పిలుచుకునే చిట్యాల ఐలమ్మ జయంతి సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. వారి త్యాగాలను స్మరించుకుంటూ, ఘన నివాళులు అర్పించారు. నాటి రాచరిక పాలనలో, తెలంగాణ రైతాంగ న్యాయమైన హక్కులకోసం, ధిక్కార స్వరం వినిపించిన ధీర వనిత, అణచివేతకు గురవుతున్న సబ్బండ కులాల ఆత్మగౌరవ ప్రతీక, ఐలమ్మ అని కేసీఆర్ కొనియాడారు. నాటి భూస్వాములను ఎదురించి ధిక్కార స్ఫూర్తినీ,. నాటి చట్టాల పరిధిలో న్యాయస్థానంలోనూ పోరాడి గెలిచి ప్రజాస్వామిక స్ఫూర్తినీ., ప్రదర్శించిన ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా సాగుతున్న, అస్తవ్యస్త పాలనా రాజకీయ పరిస్థితుల్లో చాకలి ఐలమ్మ ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తి, ప్రదర్శించిన తెలంగాణ సోయి నేటి యువతకు అనుసరణీయమని కేసీఆర్ స్పష్టం చేశారు.

# మన్మోహన్‌సింగ్ జీవితం జెన్‌జీ సహా.. అన్ని తరాలకు స్ఫూర్తి

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ విప్రో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మన్మోహన్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరణ
- "దేశం రాజకీయ సంక్షోభంలో ఉన్నప్పుడు మన్మోహన్‌సింగ్ పగ్గాలు చేపట్టారు.
- భూగరిష్ఠ పరిమితి చట్టాలు చేయడంలో ఆనాడు భూమి ఉన్నవాళ్లే కీలకపాత్ర పోషించారు.
- ఆ లోపాన్ని సరిదిద్దేలా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భూ సేకరణ చట్టాన్ని చేసింది.
- ప్రభుత్వం భూ సేకరణ చేస్తే నిర్వాసితుల ఆమోదం తప్పనిసరి చేశారు.
- అలాంటి గొప్ప నేతకు భారతరత్న ఇవ్వకపోవడం శోచనీయం.
- మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇచ్చేందుకు కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటి?
- పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవిస్తేనే.. మనకు విజ్ఞత ఉన్నట్టు.
- మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తున్నా.
- ఆయన జీవితం జెన్‌జీ సహా అన్ని తరాలకు ఒక స్ఫూర్తి.
- మన్మోహన్ సింగ్, పీవీ నర్సింహారావు ఆలోచనల ఫలితమే..
- సరళీకృత ఆర్థిక విధానం. ఆనాడు ఇద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయాలే ఇవాళ దేశాన్ని పటిష్ఠంగా నిలబెట్టాయి.
- వారిద్దరి నిర్ణయాల వల్లే ఇలాంటి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లు ఏర్పడ్డాయి"




- విచారణ కోసం బీఎల్‌వోలను కలవాల్సిన అవసరం లేదు
- బీఎల్‌వోలే ఓటర్ల ఇళ్లకు వస్తారని సీఈసీ ప్రకటన
- బీఎల్‌వోలే డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేస్తారు
- సర్ ప్రక్రియ ఆరోపణలపై సీఈసీ కీలక భేటీ

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ సార్ నోటీసులపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణ కోసం తప్పనిసరిగా బూత్ లెవల్ ఆఫీసర్లను బీఎల్‌వో కలవాల్సిన అవసరం లేదని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. బీూళే సంబంధిత ఓటర్ల ఇళ్లకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లను పరిశీలించి వారే అప్‌లోడ్ చేస్తారని ఈసీ పేర్కొంది. సార్ ప్రక్రియపై దేశవ్యాప్తంగా ఆరోపణలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్న క్రమంలో ఎన్నికల సంఘం అధికారులు కీలక సమావేశం నిర్వహించారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా నోటీసుల విచారణ, డాక్యుమెంట్ల పరిశీలన ప్రక్రియను సులభతరం చేయడంపై ఈ భేటీలో చర్చించారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో నోటీసుల పంపిణీ, విచారణ దశ కొనసాగుతోంది.

## ఎన్నికల సంఘం ఏ పార్టీ సొత్తు కాదు..



హైదరాబాద్:(తెలంగాణ వాణి)

భారత ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని, ఈ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్షన్ కమిషన్ నిర్ణయాధికారాల విషయంలో ఉత్పన్నమవుతున్న భిన్నాభిప్రాయాలు, 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియలో పారదర్శకత లోపించడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

## కౌశిక్ రెడ్డిపై పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఫైర్

హైదరాబాద్:(తెలంగాణ వాణి)

సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత మరియు బెదిరింపు వ్యాఖ్యలను తెలంగాణ స్టేట్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ (హైదరాబాద్ సిటీ యూనిట్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు నల్ల శంకర్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు. బాధ్యతాయుతమైన ఒక సీనియర్ ఐపీఎస్ అధికారిని ఉద్దేశించి "మీ అంతు చూస్తా", "రిటైర్ అయిన తర్వాత కూడా నిన్ను వదలను" వంటి బెదిరింపు వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం తగదని స్పష్టటం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులకు ఎంత గౌరవం ఉందో, చట్టబద్ధంగా విధులు నిర్వహించే అధికారుల గౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.

## ఈసీ బీజేపీ కార్యాలయం కాదు

హైదరాబాద్:(తెలంగాణ వాణి)



: ఓటరు జాబితా సవరణలో వెలుగు చూసిన అంశాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో 'రిఫరీ'పైనే అనుమానం కలిగితే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంఘం స్వతంత్రతే పునాది అని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ఏ ప్రయత్నాన్నీ కాంగ్రెస్ చూస్తూ ఊరుకోదని, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణకు ఉద్యమిస్తామన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రత కోసం రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని, ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడే వరకు కాంగ్రెస్ వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.ఎన్నికల సంఘం బీజేపీ కార్యాలయం కాదని ఓటరు జాబితా కేంద్ర ప్రభుత్వ ఆస్తినో, అధికార పార్టీ సొత్తో కాదని కాదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు దేశ ప్రజల రాజ్యాంగ హక్కు అన్నారు. ఎన్నికల సంఘాన్ని బీజేపీ రాజకీయ పరికరంగా మార్చే ప్రయత్నాన్ని సహించమన్నారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి సీజేఐని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ప్రధాని సూచించిన కేంద్ర మంత్రిని కమిటీలో చేర్చి బీజేపీ మెజారిటీని ఖాయం చేసుకుందని ఆరోపించారు.

## ఆ ప్రచారం నమ్మొద్దు.. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థలో లోపాల్లేవ్ : తితిదే

తిరుమల: శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ బుకింగ్‌పై భక్తుల్లో వ్యక్తమవుతున్న సందేహాలకు తితిదే వివరణ ఇచ్చింది. ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థలను తితిదే.. అధిక డిమాండ్‌కు తగ్గట్టుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పటిష్ఠంగా నిర్వహిస్తున్నట్లు తెలిపింది. అందుబాటులో ఉన్న కోటాతో పోలిస్తే డిమాండ్ దాదాపు 9 రెట్లు అధికంగా ఉంటుందని పేర్కొంది. ఈ కారణంగా టికెట్లు అత్యంత తక్కువ సమయంలోనే పూర్తవుతాయని వివరించింది. టికెట్ లభించకపోవడాన్ని, ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ పని చేయకపోవడాన్ని ఒకటిగా పరిగణించవద్దని తితిదే స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని భక్తులకు తితిదే విజ్ఞప్తి చేసింది.

# దసరా నుంచి వందే భారత్ స్లీపర్



**విజయవాడ,** : ఏపీ ప్రజలకు భారీ గుడ్ న్యూస్. రైల్వేశాఖ సూపర్ న్యూస్ అందించనుంది. ఏపీ మీదుగా వందే భారత్ స్లీపర్ రైళ్లను నడిపేందుకు కసరత్తులు చేస్తోంది. విజయవాడ డివిజన్ మీదుగా ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకుంది. దేశంలో తొలి స్లీపర్ రైలును ఈ ఏడాది జనవరిలో హౌరా-గువహతి మధ్య రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. ప్రధాని మోదీ స్వయంగా దీనిని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం ఏపీ మీదుగా సాధారణ వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం, తిరుపతి వరకు, కాచిగూడ నుంచి బెంగళూరు, నర్సాపురం నుంచి చెన్నైకు రైళ్లు నడుస్తున్నాయి. అయితే స్లీపర్ రైళ్లు లేకపోవడంతో ఇప్పుడు వాటిని కూడా తీసుకొచ్చేందుకు రైల్వేశాఖ ప్రయత్నాలు చేస్తోంది.దసరా నాటికి విజయవాడ మీదుగా వందే భారత్ స్లీపర్ రైలు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. విశాఖపట్నం నుంచి బెంగళూరు, విజయవాడ నుంచి బెంగళూరు మధ్య ఈ రైళ్లను నడిపేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇక విజయవాడ నుంచి అయోధ్య, విజయవాడ నుంచి ఢిల్లీకి నడిపితే బాగుంటుందని మరికొంతమంది ప్రతిపాదిస్తున్నారు. దీంతో ఏ రూట్లో అనేది క్లారిటీ లేనప్పటికీ.. దసరా నాటికి ఏపీలో తొలి వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కనుందని తెలుస్తోంది. వందే భారత్ స్లీపర్ రైళ్లల్లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మెరుగైన కుషనింగ్, లేటెస్ట్ ఇంటీరియల్స్, ఇంటర్నెట్, ఛార్జింగ్ పాయింట్లు, ఆటోమేటిక్ డోర్లు, ఎల్ఈడీ డోర్లు, ఎల్ఈడీ లైట్లు, సౌండ్ ప్రూఫ్, ప్రత్యేక సెన్సార్లు వంటివి ఉన్నాయి. విమానం తరహాలోనే అత్యాధునిక సౌకర్యాలు ఉంటాయి.వందే భారత్ స్లీపర్ రైళ్లు గంటకు 160 నుంచి 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఇందులో ఫస్ట్, సెకండ్, థర్డ్ ఏసీ బోగీలు ఉంటాయి. ఇప్పటికే ప్రారంభమైన హౌరా-గువహతి తొలి వందే భారత్ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉన్నాయి. ఈ ట్రైన్లో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. అయితే స్లీపర్ రైళ్లల్లో ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటివి ఉండవు. కన్ఫార్మ్‌డ్ టికెట్ ఉన్నవారిని మాత్రమే ప్రయాణానికి అనుమతిస్తారు. వీటిల్లో సౌండ్ ప్రూఫ్ సిస్టమ్ ఉండటంతో ఎలాంటి సౌండ్స్, కుదుపులు అనేవి ఉండవు. దీంతో రాత్రి సమయంలో ప్రశాంతంగా ప్రయాణం చేయవచ్చు. అటు సికింద్రాబాద్-ఢిల్లీ రూట్లో కూడా వందే భారత్ స్లీపర్ రైలు తీసుకురావాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ప్రయత్నాలు చేస్తోంది.

# రెండు ఎమ్మెల్సీ సీట్లకు 10 మంది పోటీ



**విజయవాడ :** కూటమి నేతలకు నామినేటెడ్ పదవులు ఊరిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికల సందడి ముగిసిన వెంటనే, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ రేసు మొదలైంది. వచ్చేనెలలో ఇద్దరు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. ఈ ఇద్దరూ గవర్నర్ కోటాలో ఎంపికైన వారే కావడంతో ఆ రెండు స్థానాలను అధికార కూటమి దక్కించుకునే పరిస్థితి ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత రెండు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసే చాన్స్ రావడంతో కూటమి నేతలు ఎవరికి చాన్స్ ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. రెండేళ్లుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న పలువురు నేతలు ఈ సారైనా అధిష్టానం తమకు అవకాశం ఇస్తుందా? లేక ఈ సారి కూడా 'సారీ' అంటూ చేతులు దులుపుకుంటుందా? అని టెన్షన్ పడుతున్నారు.వచ్చేనెల 27తో శాసనమండలిలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఎంపికైన జకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుందని శాసన మండలి రికార్డులు ద్వారా తెలుస్తోంది. దీంతో ఆ రెండుస్థానాల భర్తీకి జులైలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అంటున్నారు. జూన్ లో 4 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగితే, పలువురు ఆశావహులు పోటీ పడ్డారు. కానీ, రకరకాల సమీకరణాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ నలుగురు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సమయంలో పలువురు ఆశావహులకు ఎమ్మెల్సీ అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై వారు ఆశ పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మంది ఎమ్మెల్సీ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో గత ఎన్నికల సమయంలో సీట్లు కోల్పోయిన త్యాగరాజులే ఎక్కువగా ఉన్నారు. ఇలా ఎమ్మెల్సీ పదవులు కోరుకుంటున్న వారిలో టీడీపీ నేతలే ఎక్కువగా ఉన్నారు. వీరిలో ప్రధానంగా మాజీ మంత్రి, సీనియర్ నేత దేవినేని ఉమాతోపాటు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, బుద్ధా వెంకన్న, వంగవీటి రాధాకృష్ణ, మహాసేన రాజేశ్ వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ఐదుగురికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని 2024 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేస్తున్నారు.సాక్ష్యంగా నిలిచిన మరో వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పవన్ కోసం టికెట్ వదులుకున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విషయంలో పార్టీ కేడర్ కూడా ఉత్కంఠగా ఎదురుచూస్తోందని అంటున్నారు. తాజాగా ఆయనను నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతల నుంచి కూడా తప్పించారు. దీంతో వర్మ త్యాగం నిష్ఫలం అయిందని అసంతృప్తి కేడర్ లో వ్యక్తమవుతోందని అంటున్నారు. అయితే వర్మకు తగిన న్యాయం చేయాలని ముఖ్య నేతలు ఇద్దరూ భావిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఈ సారి ఎమ్మెల్సీ చాన్స్ ఇస్తారా? లేదా? అన్నది ఆసక్తి రేపుతోంది.నిందితుడికి మరణ దండన ఖాయం చేసిన కోర్టు మరోవైపు మైలవరం సీటు వదులుకున్న దేవినేని ఉమా, విజయవాడ పశ్చిమ సీటును త్యాగం చేసిన బుద్ధా వెంకన్న, పి.గన్నవరం నుంచి పోటీకి అవకాశం దక్కినా, చివరి నిమిషంలో అధిష్టానం సూచనతో వెనక్కి తగ్గిన మహాసేన రాజేశ్ కూడా ఎమ్మెల్సీ ఆశావహులుగా గట్టి పోటీ ఇస్తున్నారని చెబుతున్నారు.

# 68 మండలాల్లో డేంజర్



**విజయవాడ:** ఏపీలో వర్షాభావం కనిపిస్తోంది. జూలై రెండవ వారం దాటుతున్న ఆశించిన స్థాయిలో వర్షాలు పడడం లేదు. సాగునీటి జలాశయాలు, ప్రాజెక్టుల్లో నీరు లేదు. డెడ్ స్టోరేజ్ కు చేరుకున్నాయి నిల్వలు. మరోవైపు ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమైంది కానీ.. వర్షాలు లేక ఆశించిన స్థాయిలో పనులు ముందుకు వెళ్లడం లేదు. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ వర్షాలు పడ్డాయి కానీ.. ప్రస్తుతానికి ముఖం చాటేసాయి. వరి విత్తనాలు చల్లి వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు అన్నదాతలు. ప్రస్తుతం పరిస్థితి చూస్తుంటే మాత్రం ఖరీఫ్ ప్రమాదకరమే అని అర్థం అవుతోంది. ఈ తరుణంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమయింది. ఈ వాతావరణ విపత్తుని ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. ప్రధానంగా ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించింది. అది మన రాష్ట్రంపై స్పష్టంగా కనిపించింది. నైరుతి రుతుపవనాల రాక కూడా ఆలస్యం అయ్యింది. జూన్ రెండో వారానికి రాష్ట్రానికి రుతుపవనాలు తాకాయి. తీవ్ర వర్షాభావం నెలకొంది. వర్షపాతం లోటు కనిపిస్తోంది. జూన్లో మైనస్ 25 వర్షపాతం లోటు నమోదు కాగా.. జూలైలో ఇప్పటివరకు మైనస్ 41 శాతం వర్షపాతం లోటు నమోదయింది. సాధారణంగా జూన్ నుంచి నవంబర్ వరకు నైరుతీ రుతుపవనాలు విస్తరిస్తాయి. ఖరీఫ్ కు ఇవే ప్రధానం. ఈ సీజన్ మొత్తం మైనస్ 27% వర్షపాతం లోటుతో ముగిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఉమ్మడి 13 జిల్లాల్లో 68 మండలాలు ఉన్నాయి. అందులో ఎల్ నినో ప్రభావం 105 మండలాలపై తీవ్రంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. 208 మండలాలపై మాత్రం మధ్యస్థ స్థాయిలో ప్రభావం ఉండనుంది. ప్రధానంగా శ్రీ సత్య సాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాలపై ప్రభావం ఉండనుంది. మధ్యస్థ స్థాయి ప్రభావం కర్నూలు, నంద్యాల, చిత్తూరు, వైయస్సార్ కడప, తిరుపతి, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాలపై ఉండనుంది. నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ కీలక సూచనలు చేస్తోంది.

**ఉరుములు, పిడుగులు.. ఆ జిల్లాలకు హై అలెర్ట్**

ఏపీ వ్యాప్తంగా చల్లటి వాతావరణం కొనసాగుతోంది. అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. కానీ పూర్తిస్థాయిలో మాత్రం కురవడం లేదు. ఇంకా వర్షపాతం లోటు కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెదర్ అప్డేట్ ఇచ్చింది. నాలుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు పడతాయని తెలిపింది. అయితే భారీ వర్షాలు నమోదు కావడం లేదు. ఎల్ నినో ప్రభావం స్పష్టంగా ఉంది. ఖరీఫ్ అదును దాటుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులపాటు కొనసాగితే ఇబ్బందికర పరిస్థితులు తప్పేలా లేవు. అయితే నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండడంతో కొంత ఆశలు రేగుతున్నాయి.ఐదు రోజులపాటు నైరుతీ రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈరోజు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాల్లో చెదురు మధురుగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేస్తోంది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ కనిపిస్తోంది. పిడుగులు పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. రైతులతోపాటు పశువుల కాపర్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.ఏపీ పై ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం తేలికపాటి వర్షాలు తప్ప.. భారీ వర్షాలు నమోదు కావడం లేదు. నైరుతి రుతుపవనాలు సైతం ఆలస్యం అయ్యాయి. పెద్దగా ప్రభావం సైతం కనిపించడం లేదు. ఖరీఫ్ పంటలపై ప్రభావం కనిపిస్తోంది. ఈ ఏడాది ఇలానే కొనసాగితే కష్టం అని రైతుల్లో ఒక రకమైన ఆందోళన నెలకొంది. మరోవైపు ఎల్ నినో హెచ్చరికల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ప్రత్యామ్నాయ పంటలను సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులు ఈ పంటలపై సూచనలు అందిస్తున్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాలో వర్షపాతం లోటు ఉంటుందని ముందుగానే అంచనా వేశారు.

# ఆ ఇల్లే అందరికి ఆదర్శం

**అనంతపురం,** : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లిలోని నాగప్ప కుటుంబం ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఆరు తరాలుగా 80 మందికిపైగా కుటుంబ సభ్యులు కలిసి ఉంటూ.. ఉమ్మడి కుటుంబానికి సరైన నిర్వచనం చెప్తున్నారు. ఆ ఇంట్లో పిల్లాపెద్దా అందరూ కలిసి 85 మంది వరకూ ఉంటారు. వీరిలో 25 మంది వరకూ విద్యార్థులే కావడం విశేషం. ఈ కుటుంబానికి వేరువేరు చోట్ల కలిపి 127 ఎకరాల వరకూ భూమి ఉంది. మగాళ్లు అందరూ ఈ భూమిలో సేద్యం పనులు చూస్తుంటారు. వీరందరికీ వేరువేరుగా ఇళ్లు ఉన్నా కూడా.. వంట మొదలుకుని సేద్యపు పనులు, ఆదాయం వరకూ అంతా ఉమ్మడిగానే జరుగుతుంది.నాగప్ప ఉమ్మడి కుటుంబంలో మొత్తం 85 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ వేర్వేరు ఇళ్లు ఉన్నాయి. అయితే అందరూ కలిసి ఒకేచోట వండుకుంటారు. కుటుంబంలోని మహిళలు అందరూ కలిసి.. ఉమ్మడి కుటుంబం మొత్తానికి కావాల్సిన వంట ఏర్పాట్లు చూస్తారు. ఒకే వంటగదిలో భోజనం తయారుచేస్తారు. కుటుంబం మొత్తానికి సరిపడాలంటే రోజూ 80 కిలోల బియ్యాన్ని వండాల్సి వస్తుందని మహిళలు చెప్తున్నారు. ఇక ఆదివారం రోజులలో నాన్ వెజ్ రుచిచూడాలంటే కనీసం 30 కేజీల మటన్ లేదా చికెన్ కావాల్సిందేనని చెప్తున్నారు. ఉదయం ఐదు గంటలకు మొదలుపెడితే రాత్రి 9 గంటల వరకూ వంటగదిలో పొయ్యి మంట మండాల్సిందేనట.అయితే ఆరు తరాలుగా.. వీరంతా కలిసి ఉండటానికి బావా బావమరుదులు తీసుకున్న నిర్ణయమే కారణమట.. ఆరునూరైనా మనం కలిసే ఉందామంటూ అరవై సంవత్సరాల కిందట తీసుకున్న నిర్ణయమే వీరంతా ఇలా కలిసి ఉండటానికి కారణంగా చెప్తున్నారు. ఈ కుటుంబానికి మూలమైన నాగప్పకు.. ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు ఒకే కుమార్తె. రెండో భార్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అయితే తన పిల్లలు అందరూ ఒకేచోట కలిసి ఉండాలనే ఉద్దేశంతో నాగప్ప.. పెద్ద భార్య కూతురికి ఇల్లరికం పెళ్లి చేసి అల్లుడిని ఇంటికి తెచ్చుకున్నాడు. ఈ దంపతులకు నలుగురు మగపిల్లలు సంతానం.వీరిలోని హనుమంతరాయుడు.. నాగప్ప రెండో భార్య కొడుకు ముత్యాలప్ప (బావమరిది) కలిసి తమ తాతగారి మాట ప్రకారం ఉమ్మడి కుటుంబంగా కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి వీరంతా కలిసే ఉంటున్నారు. ఈ ఇంట్లో కూడా ఎక్కువగా ఇల్లరికం వివాహాలే జరుగుతుంటాయి. అలా కొడుకులు, మనవళ్లూ, మనవరాళ్లూ, మునిమనవరాళ్లూ ఇలా అందరూ కలిసి 85 మంది అయ్యారు. ఈ కుటుంబానికి 127 ఎకరాల భూమి ఉంది. అలాగే70 వరకూ గేదెలూ, 40 ఆవులూ, వేయికిపైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. సేద్యం ద్వారా ధాన్యం, కూరగాయలు పండిస్తున్నారు. ఇలా పండించిన వాటిలో కుటుంబ అవసరాలు పోనూ మిగతా వాటిని మార్కెట్లో విక్రయిస్తుంటారు. అలాగే నాలుగు ప్రైవేటు బస్సులను నడుపుతూ.. ఏటా 20 లక్షలు సంపాదిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయాన్ని ఉమ్మడి కుటుంబంకోసం వెచ్చిస్తున్నారు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే వేయి రూపాయలు దాటిన ఏ ఖర్చుకు అయినా.. కుటుంబ పెద్దలు హనుమంతరాయుడు, ముత్యాలప్పల నిర్ణయం తప్పనిసరి. అలా ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు నిలువెత్తు నిదర్శనంగా ఈ ఫ్యామిలీ నిలుస్తోంది.

# బీజేపీ నేతల మౌనం ఎందుకో...



**విశాఖపట్టణం:** ఆంధ్రప్రదేశ్ బీజేపీలో ఏదో జరుగుతుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ పెద్దగా రాజకీయంగా యాక్టివ్ గా లేకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వంపై ప్రత్యర్థులు విమర్శలు చేస్తున్నప్పటికీ దానికి సరైన కౌంటర్ మాత్రం ఇవ్వడం లేదు. బీజేపీ నేతల మౌనం వెనక అర్థం ఏంటన్నది ఇప్పటికీ కూటమిలోని ప్రధాన పక్షాలైన టీడీపీ, జనసేనలకు అర్థం కాకుండా ఉంది. రాష్ట్ర నేతలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా? లేదా కేంద్ర నాయకత్వం నుంచి ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? అన్న అనుమానం అందరిలోనూ కలుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళు పూర్తి కావస్తున్నప్పటికీ కమలం పార్టీ రాష్ట్ర నేతలు మాత్రం సంతోషంగా లేరు. తమ నియోజకవర్గాల్లో... అనేక నియోజకవర్గాల్లో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న చోట టీడీపీ, జనసేన నుంచి తమకు మద్దతు లభించడం లేదని రివర్స్ లో బీజేపీ నేతలు ఈ విధమైన నిరాసక్తతతో ఉన్నారని చెబుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ పది స్థానాల్లో పోటీ చేసింది. ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. అలాగే ఆరు లోక్ సభ స్థానాలకు పోటీ చేసి మూడింటిలోవిజయం సాధించింది. అనపర్తి నుంచి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , కైకలూరు నుంచి కామినేని శ్రీనివాస్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి, ఆదోని నుంచి డా. పి.వి. పార్థసారథి, జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డి, ధర్మవరం నుంచి సత్య కుమార్ యాదవ్, ఎచ్చెర్ల నుంచి నడుకుదిటి ఈశ్వరరావు ఎన్నికయ్యారు. విశాఖపట్నం ఉత్తరం నుంచి పెన్మెత్స విష్ణు కుమార్ రాజులు ఎన్నికయ్యారు. రాజమండ్రి పార్లమెంటు నుంచి దగ్గుబాటి పురంధేశ్వరి, అనకాపల్లి సీఎం రమేష్, నర్సాపురం నుంచి భూపతిరాజు శ్రీనివాసవర్మలు ఎన్నికయ్యారు. దీంతో పాటు మాధవ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు... కానీ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలున్నప్పటికీ ఎవరూ పెద్దగా స్పందించడం లేదు. అసలు కూటమి ప్రభుత్వంతో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వం పై వస్తున్న ఆరోపణల విషయంలోనూ పెద్దగా స్పందించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం.. కూటమి సర్కార్ లో తమకు ప్రాధాన్యత దక్కకపోవడం ఒక కారణమయితే, మరొక ముఖ్యమైన కారణం.. తమ నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ ఛార్జుల పెత్తనం సాగుతుండటమేనని చెబుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర నాయకత్వానికి కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే సంయమనం పాటించాలని, రానున్న కాలంలో అంతా సర్దుకుంటుందని నాయకత్వం చెప్పిందట. అయినా సరే కూటమిలో మిత్రధర్మం పాటించకుండా వ్యవహరించడంపై టీడీపీ, జనసేనలో కొంత అసంతృప్తి అయితే మొదలయింది. తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం, రుతుపవనాల లోపం వల్ల వ్యవసాయానికి తీవ్ర ఆటంకం కలిగి కరవు పరిస్థితులు ఏర్పడ్డాయి.

# ఏజెన్సీ ప్రాంతాలపై జనసేన కన్ను




**విశాఖపట్టణం,** : ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏజెన్సీ ప్రాంతాలపై అధికార కూటమి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన తర్వాత గిరిజన నియోజకవర్గాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బాధ్యతలో కీలక పాత్రను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ ఇటీవల ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని సమాచారం. రహదారులు, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెబుతున్నారుప్రత్యేకించి ఎన్నో దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలుస్తోంది. “అడవి తల్లి బాట” వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే పనులు వేగవంతం చేసినట్లు అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ చర్యలతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల స్పందన పెరుగుతుందని కూటమి నాయకులు భావిస్తున్నారు.అభివృద్ధితో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా అడవి ప్రాంతాల్లో ఏనుగుల సంచారం వల్ల పంటలు, ఆస్తులకు కలుగుతున్న నష్టాన్ని తగ్గించే చర్యలు, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, గ్రామీణ కనెక్టివిటీ పెంపు వంటి అంశాలపై సంబంధిత శాఖలు పనిచేస్తున్నాయని చెబుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయని అధికార పార్టీ అంచనా వేస్తోంది.రాజకీయంగా పరిశీలిస్తే, 2009 నుంచి ఏజెన్సీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఎక్కువగా కొనసాగిందని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి మంచి ఫలితాలు సాధించినప్పటికీ, అరకు పార్లమెంట్ స్థానం మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల నాటికి ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో కూటమి ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు చేరువయ్యే అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.మరోవైపు విపక్షం కూడా ఈ ప్రాంతాల్లో తన బలాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఏజెన్సీ నియోజకవర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలే భవిష్యత్ ఎన్నికల్లో ఈ ప్రాంత ఓటర్ల తీర్పును ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలిచే అవకాశముందని భావిస్తున్నారు.

## బాన్సువాడ వాసికి అరుదైన గౌరవం



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణకు చెందిన బాన్సువాడ పట్టణ మదీనా కాలనీ వాసి సాలం బిన్ ఈసాకు ఖతార్‌లో అరుదైన గౌరవం దక్కింది. దోహాలోని ఐడియల్ ఇండియన్ స్కూల్‌లో నిర్వహించిన వార్షిక తహనీయతి మజ్లిస్‌లో మీసాలీ ఉస్తాద్ ఆదర్శ ఉపాధ్యాయ అవార్డును ఆయన అందుకున్నారు. ఖతార్‌లోని 12 ప్రముఖ భారతీయ పాఠశాలల నుంచి ఒక్క ఉత్తమ ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి అందించే ఈ అవార్డును భారత రాయబారి డాక్టర్ కె. శ్రీకర్ రెడ్డి, ప్రథమ కార్యదర్శి హర్ష్ పాండే చేతుల మీదుగా సాలం బిన్ ఈసా స్వీకరించారు. బోధనా నైపుణ్యం, విద్యార్థులను తీర్చిదిద్దడంలో చూపిన అంకితభావానికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా బాన్సువాడ కాంగ్రెస్ నాయకుడు ఎం.డి. దావూద్ సాలం బిన్ ఈసాను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## పర్యాటక రంగంపై విద్యార్థుల్లో అవగాహన పెంపు




**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేఖరి):**
ప్రపంచ పర్యాటక దినోత్సవం--2026 సందర్భంగా నిర్మల్ జిల్లాలో యువ టూరిజం క్లబ్ విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగంలో వస్తున్న మార్పులపై పోటీలు నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా టూరిజం నోడల్ అధికారి శ్రీకాంత్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టూరిజం క్లబ్ సమన్వయకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ భూభారతి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

**రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేఖరి):**
పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో దరఖాస్తుల పరిష్కారం, రీ సర్వే ప్రక్రియపై సమీక్షించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని, అవసరమైతే అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వేను వేగవంతం చేసి, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**నిర్మల్-వానల్‌పాడ్:సెప్టెంబర్26 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,ధీరవనిత చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా భైంసా మండలం వానల్‌పాడ్ గ్రామంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మీ--వినోద్ మాట్లాడుతూ పేదలు,బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు.ఆమె ధైర్యం,పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొప్పారం సాయిరెడ్డి, రజక సంఘం నాయకులు రాజు, భూమన్న,నవీన్,భూమేష్, సంఘం సభ్యులు,యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత

**మార్చి నాటికి పనులు పూర్తి చేసేలా కార్యాచరణ: కలెక్టర్ భవేష్ మిశ్రా**
**నిజామాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. కందకుర్తి, యంచ వద్ద భక్తుల పుణ్యస్నానాలకు అవసరమైన సదుపాయాల కల్పన పనులు ప్రారంభించినట్లు చెప్పారు. శనివారం గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. కందకుర్తి, యంచతో పాటు తుంగిని, పోచంపాడ్, తడ్‌పాకల్ తదితర ప్రాంతాల్లో ఘాట్లు, అప్రోచ్ రోడ్లు, పార్కింగ్, అత్యవసర నిష్క్రమణ మార్గాలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కందకుర్తి వద్ద నీటి ప్రవాహం కారణంగా కొత్త పుష్కర ఘాట్ పనులకు కొంత సమయం పడుతుందని, మిగతా పనులను వేగవంతం చేసి మార్చి నెలాఖరులోగా



పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కస్బా పాఠశాల భవంతిని బీసీ బాలుర వసతి గృహంగా వినియోగించాలి

**త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా**
**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేఖరి):**
నిర్మల్ పట్టణంలోని కస్బా ఉన్నత పాఠశాల ఖాళీ భవంతిని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంగా మార్చేందుకు ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం భవంతిని పరిశీలించిన కలెక్టర్.. అవసరమైన మరమ్మతులు, మార్పులు చేపట్టి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని, వసతి గృహాన్ని వీలైనంత త్వరగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈవో భోజన్న, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు శ్రీనివాస్, దయానంద్, సహాయ బీసీ సంక్షేమ అధికారి



సత్యనారాయణ, తహసిల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాలి

**ఘనంగా జయంతి ఉత్సవాలు**



**నిజామాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, అదనపు కలెక్టర్ భుజంగరావు పిలుపునిచ్చారు. శనివారం వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్సీ, అదనపు కలెక్టర్, అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి సభ నిర్వహించారు. పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి. శాఖ అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**చౌటుప్పల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను చౌటుప్పల్ మండల, మున్సిపాలిటీ రజక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలోని ఐలమ్మ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మండల రజక సంఘం అధ్యక్షుడు బాతరాజు యాదగిరి, మున్సిపాలిటీ అధ్యక్షుడు కానుగు బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మానవ హక్కుల కమిషన్ సభ్యుడు చిలుకల శ్రీనివాస్ యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ రావుల స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బొల్లారం లక్ష్మీనారాయణ, మలిగే నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి సామకూర యాదయ్య, మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మలిగే బాలకృష్ణ, మండల ఉపాధ్యక్షులు ముదిగొండ వెంకటేశం, కానుగు శివకుమార్, పెదగంటి లింగస్వామి, మలిగే కృష్ణ, కానుగు శేఖర్, మలిగే శ్రీను, బాతరాజు దశరథ, మలిగే చంద్రయ్య, బాతరాజు యాదయ్య, మలిగే శంకర్,రావుల ముత్యాలు, ఎలకరాజు అంజయ్య, బాతరాజు వెంకటేశం, గరిసె నరసింహ, బాతరాజు అశోకు, మరియు చౌటుప్పల్ మండల, మున్సిపాలిటీ రజక సోదరులందరు పాల్గొన్నారు.



## 30లోపు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి చేయాలి

**కలెక్టర్ భవేష్ మిశ్రా**
**నిజామాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఈ నెల 30లోపు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ నగరంతో పాటు ఆర్మూర్, బోధన్, రుద్రూర్, మోర్తాడ్, బాల్కొండ ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయి ంచాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో అర్హుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, డ్రా పద్ధతిలో ఇళ్ల కేటాయింపులు చేపట్టాలని తెలిపారు. అనర్హుల పేర్లను తొలగిస్తూ కారణాలను నమోదు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదేశించారు. కేటాయింపులు పూర్తిగా పారదర్శకంగా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, హౌసింగ్ ఇంచార్జి పీ.డీ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, హౌసింగ్ ఏ.ఈ నివర్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎస్టీయూ 80వ వసంతాల వైభవోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



**చిలుకూరు, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించనున్న ఎస్టీయూ 80వ వసంతాల వైభవోత్సవాలకు మండలంలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు సురగాని లింగయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిలుకూరు మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సహకారంతో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఉపాధ్యాయుల హక్కుల కోసం ఎస్టీయూ ఏర్పడిందని, సంఘం చేపట్టిన ఉద్యమాల ఫలితంగా ఉపాధ్యాయులకు అనేక జీవోలు, పీఆర్సీలు, డీఏలు అందుబాటులోకి వచ్చాయని లింగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండు ఆదినారాయణ, బాల బోయిన పవన్, ఎలగొండ శ్రీనివాస్,మాదా సామ్సన్,శ్యామ్ సుందర్, గురువారెడ్డి,అనంత రామారావు, కొండా రామాంజనేయులు, రామ్ శెట్టి రామ నరసయ్య, కంపసాటి కృష్ణ,దొంగరీ శ్రీను, కొండ ధనమూర్తి, దొంగరి వీరబాబు, డివిఎల్ ప్రసాద్,కొండా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేఖరి):**
చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకుని సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పోషించిన పాత్ర, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని రాథోడ్ రమేష్ పేర్కొన్నారు. ఆమె ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, కార్మిక శాఖ అధికారి రాజలింగు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ



**భైంసా, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భైంసా మండలం సిద్దూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ మాలెపు దుర్పతిబాయి (సుధాకర్) యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని ఆమె అన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు కాలేవర్ ఆకాష్, ఉపాధ్యాయులు గజేందర్, బాలాజీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బూట్ల పంపిణీ




**రాజాపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేఖరి):**
నెమిల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ పులి రాజు శనివారం బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే దేశ భవిష్యత్తు నిర్మాతలని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఓర్పుతో బోధించి ప్రతి చిన్నారి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మార్క శివ కుమార్ ప్రధానోపాధ్యాయులు నమిల భరత్ కుమార్ కందుల మమత మంత్రి నాగరాజు మేక సాయి కృప రజిత పాల్గొన్నారు.

## జెండా బాలాజీ ఆలయంలో మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు



**నిజామాబాద్,సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జెండా బాలాజీ ఆలయంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లవంగ ప్రమోద్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి,నగర అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ,నుడా చైర్మన్ కేశ వేణు, రామ్ భూపాల్, జీవి రామకృష్ణ, కార్పొరేటర్లు ఆదిత్య పాటిల్, ప్రవీణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, ఆలయ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు



**హసన్‌పర్తి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
హనుమకొండ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు శనివారం హసన్‌పర్తిలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాల బాలికల పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. భారతి దేవి అధ్యక్షత వహించగా, మండల విద్యాధికారి ఎ. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి. సునీతా రెడ్డి, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. విజయలక్ష్మి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమ నిర్వహణలో ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుడు వి. రామ్ మోహన్ సహకరించారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభ, ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే పోటీల లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## జ్యోతిరావు పూలే కాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ





**తెల్లాపూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జ్యోతిరావు పూలే కాలనీ రోడ్ నంబర్ 7లో డ్రైనేజీ పొంగిపొర్లడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని, దుర్వాసనతో పాటు దోమలు, ఈగల బెడద పెరిగిందని తెలిపారు. సమస్యపై అధికారులకు సమాచారం ఇచ్చినా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని స్థానికులు పేర్కొన్నారు. వెంటనే పూడికతీత పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ పురపాలక సంఘ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట పటిమ భావితరాలకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యుడు, నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చదువే ఆయుధంగా వైద్య సీటుతో భవాని సత్తా



**వనపర్తి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కొత్తకోట ఐదో వార్డు కౌన్సిలర్ ముంత మంజుల రామకృష్ణ కుమార్తె ఎం. భవాని ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని, భవాని విజయాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియా, సినిమాలు, సెల్‌ఫోన్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంజుల రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సత్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అండగా విద్యార్థులు



**వనపర్తి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి రేడియంట్ హైస్కూల్, తిరుమల హిల్స్ విద్యార్థులు దివ్యాంగుల కోసం రూ.16 వేల విరాళాలు సేకరించి మానవత్వాన్ని చాటుకున్నారు. పాకెట్ మనీతో పాటు ఇంటింటికీ తిరిగి సేకరించిన మొత్తాన్ని దివ్యాంగులకు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, పరవస్తు సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ విద్యార్థులను అభినందించారు. సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు మరింతగా భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం విరాళాలు అందించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు.

## బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడిగా రవినాయక్



**వనపర్తి, సెప్టెంబర్ 27 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: మదనాపూర్ మండల బంజారా సేవా సంఘం అధ్యక్షుడిగా మూడవత్ రవినాయక్ నియమితులయ్యారు. బంజారా సమాజ అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, యువతను ఐక్యం చేయడం, సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడమే లక్ష్యంగా నియామకం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు నేనావత్ కృష్ణ నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ బంజారా నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని తండాలు, గ్రామాల్లో బంజారా ప్రజలను సంఘటితం చేసి సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ విమర్శలపై కాంగ్రెస్ నేతల మండిపాటు

**వనపర్తి, సెప్టెంబర్ 27 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బీఆర్ఎస్ నాయకులు రాజకీయ అవసరాల కోసం గతంలో విమర్శించిన నేతలతో ఇప్పుడు కలిసి కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పార్టీ అధికార ప్రతినిధి వాల్యానాయక్ మాట్లాడారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై గతంలో వచ్చిన భూవ్యవహారాలు, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రైతాంగానికి సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను రాజకీయ విమర్శలతో అడ్డుకోవద్దన్నారు. వ్యక్తిగత, సామాజిక వర్గాలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం సరికాదని, చేసిన వ్యాఖ్యలకు సంబంధితులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, బి.కృష్ణ, పాకా నటి కృష్ణ, బ్రహ్మాచారి, జనార్ధన్ సాగర్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.






## చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

**చౌటుప్పల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
బీసీ సంక్షేమ యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు వీరమళ్ల కార్తీక్ గౌడ్ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకుని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సహారా బాధితులకు సొమ్ము వెంటనే చెల్లించాలి



**హసన్‌పర్తి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సహారా ఇండియా సంస్థలో డిపాజిట్లు చేసి నష్టపోయిన బాధితులకు పూర్తి సొమ్మును వడ్డీతో సహా వెంటనే చెల్లించాలని సహారా బాధితుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలో బాధితులు, ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని జాతీయ బ్యాంకుల ద్వారా డిపాజిటర్లకు న్యాయం చేయాలని కోరారు. ఏళ్లుగా తమ సొమ్ము కోసం ఎదురుచూస్తున్న బాధితుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

## చాకలి ఐలమ్మకు ఎస్పీ నివాళి



**వనపర్తి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. సునీతారెడ్డి, ఐపీఎస్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాటాడుతూ రైతాంగ హక్కులు, భూమిపై హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐలమ్మకు ఘన నివాళులు



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ రాజా రమేష్ దంపతులు ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐలమ్మ వారసులను శాలువాలతో సత్కరించారు.
భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, రజాకార్లకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు నడిగోట తిరుపతి, నాయకులు మంద వేణు, మహేంద్ర, రమిడి కుమార్, అనిల్ రావు, రమేష్ రెడ్డి, అరుణ్ రిషి తదితరులు పాల్గొన్నారు..



## వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

**వనపర్తి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తిలో వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను నిర్వహించారు. సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వాముల దౌర్జన్యాలకు ఎదురొడ్డి హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ తెగువ, త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, స్త్రీశక్తికి ఆమె ప్రతీక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైభీం సేవా సంఘం నాయకులు, యువశక్తి ఫౌండేషన్ ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన బోస్లే మోహన్‌రావు పటేల్



**నిర్మల్--బాసర, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బాసర మండలంలో ఇటీవల మృతి చెందిన రెండు కుటుంబాలను ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే మోహన్‌రావు పటేల్ పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన 10టీవీ ప్రతినిధి గణేష్ అమ్మ జాదవ్ కేవలాబాయి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం టాక్లి గ్రామంలో నాగభూషణం విద్యాలయ ప్రిన్సిపాల్ బాబురావు తండ్రి జారికోటె ఇరువంత్ పాటిల్ కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా జెండా జాతర ఉత్సవాలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో శనివారం నిర్వహించిన జెండా జాతరలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లుగా ఇందూరులో జెండా జాతర ఉత్సవాలు ఆనవాయితీగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయం నుంచి పులాంగ్ వరకు శోభాయాత్రగా జెండా తరలించి, అక్కడ వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.




## ముఠా గోపాల్‌ను పరామర్శించిన ఉమేశ్వర్

**తెల్లాపూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కాలు శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఉస్మాన్‌నగర్ మాజీ కౌన్సిలర్ అంతగిరిపల్లె చిట్టి ఉమేశ్వర్ ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా సంపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, కుమ్మరి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు



## బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌కు సన్మానం

**నకిరేకల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన చల్లగాని వెంకన్న తొలిసారిగా నకిరేకల్ నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ నకిరేకల్ ప్రాంతానికి చెందిన వ్యక్తి రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవి చేపట్టడం నియోజకవర్గానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు

## లక్కారంలో సీసీ కెమెరాలు ప్రారంభం



**చౌటుప్పల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం 8వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. రానున్న బతుకమ్మ పండుగను పురస్కరించుకుని గ్రామ కచ్చీరు ఆవరణాన్ని సీసీ రోడ్డు ప్రాంగణంగా అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, ఫిషరీస్ చైర్మన్ పాశం సంజయ్ బాబు, ఎస్సై అజయ్ భార్గవ్, కౌన్సిలర్ బద్రి గాలయ్య, సీసీ కెమెరాల దాత పాశం కృష్ణయ్యతో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: రైతుల సంక్షేమం, ఆర్థిక పురోగతికి నిరంతరం కృషి చేస్తామని చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్ అన్నారు. వలిగొండ రోడ్డు రైతు వేదిక వద్ద కౌన్సిలర్ కొసనం రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ మస్తాన్ బాబు యాదవ్, వైస్ చైర్మన్ పర్నే శివారెడ్డి, డైరెక్టర్ సురుకంటి లక్ష్మమ్మ యాదిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మస్తాన్ బాబు మాట్లాడుతూ పిల్లాయిపల్లి కాలువకు మరమ్మతులు చేయించి ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టి భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఆకట్టుకున్న మాక్ పార్లమెంట్




**తెల్లాపూర్ సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో తెల్లాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పార్లమెంట్ సభ్యులుగా వివిధ పాత్రలను పోషిస్తూ సభా కార్యక్రమాలను నిర్వహించే విధానం, ప్రశ్నోత్తరాల సమయం, చర్చలు, తీర్మానాలు తదితర అంశాలను ప్రదర్శన రూపంలో అద్భుతంగా ఆవిష్కరించారు. పార్లమెంట్ సభా కార్యక్రమాలు ఏ విధంగా కొనసాగుతాయో తోటి విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, సభా నిర్వహణపై అవగాహన పెంపొందించేందుకు మాక్ పార్లమెంట్ ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో విషయ ఉపాధ్యాయురాలు శ్రీమతి రేణుక, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు జి. హరిశంకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల చక్కటి ప్రదర్శనను ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రభుత్వ మిగులు భూమిని నిరుపేదలకు పంచాలి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
దండు మల్కాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 617, 114లో ఉన్న ప్రభుత్వ మిగులు భూమిని గ్రామంలోని భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎం.డి. జాంగిర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌లో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమిలేని పేదలకు జీవనాధారం కల్పించేందుకు మిగులు భూమిని పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన పేదలకు భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



## కర్ణమామిడి పీఏసీఎస్‌లో కొత్త పాలకవర్గం

**మంచిర్యాల, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
కర్ణమామిడి గ్రామ కమ్యూనిటీ హాల్‌లో పీఏసీఎస్ నూతన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హాజరై నూతన పాలకవర్గాన్ని అభినందించి సన్మానించారు. రైతుల సంక్షేమం, సహకార రంగ బలోపేతం, గ్రామీణాభివృద్ధికి పీఏసీఎస్‌లు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కమ్యూనిటీ హాల్ మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమాలు



**మంచిర్యాల, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
వయోవృద్ధుల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా నస్పూర్‌లో వారోత్సవాల గోడపత్రాలను ఆవిష్కరించారు. వారోత్సవాల్లో ఆరోగ్యం, సైబర్ భద్రత, డిజిటల్ అక్షరాస్యత, చట్టపరమైన హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి 14567 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి, ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

## బోడుప్పల్--ఘట్‌కేసర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి





**మల్కాజ్‌గిరి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
బోడుప్పల్, ఘట్‌కేసర్ సర్కిళ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.రహదారులు, డ్రైనేజీ, పార్కులు, పారిశుధ్యం, ఓపెన్ జిమ్‌ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు.

## నాగారంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**నాగారం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
: నాగారం డివిజన్-5లో బీజేపీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జూపల్లి నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నాగరాజ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కౌకుంట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ఐలమ్మ తెలంగాణ తెగువకు ప్రతీక అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళులు

**నాగారం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నాగారం డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భూస్వామ్య దోపిడీ, అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ప్రజల్లో చైతన్యం నింపిందని నాయకులు పేర్కొన్నారు. భూమి, హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం మహిళా ధైర్యసాహసాలకు, సామాజిక న్యాయానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# పట్టణంలో ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 26( తెలంగాణ వాణి ప్రతినిధి )**
రాష్ట్రంలోని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఆదిలాబాద్ జిల్లాలోని గణపతి నవరాత్రి ఉత్సవాలను జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు కష్టపడుతూ 12 రోజులపాటు నిద్రాహారాలు మాని విధులను నిర్వర్తించి ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి చేసినందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా యంత్రాంగానికి అభినందనలు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంస్కృతి ప్రతి ఏటా కొనసాగాలని కోరారు. అదేవిధంగా 12 రోజులపాటు 24 గంటలు శ్రమించిన పోలీసు సిబ్బంది సివిల్, రిజర్వ్, హోంగార్డ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, క్యూఆర్టీ, తెలంగాణ స్పెషల్ పోలీస్ వారికి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా 100 మంది ఎన్సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సక్రమంగా విధులు నిర్వర్తించి తమ వంతు పాత్ర పూర్తి చేసినందుకు అభినందనలు తెలియజేశారు. పూర్తిగా జిల్లా వ్యాప్తంగా ఆదిలాబాద్ పట్టణం, ఉట్నూర్, ఇచ్చోడ లాంటి ముఖ్యమైన పట్టణాలలో పూర్తిగా విజయవంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన లేకుండా పూర్తి అయినందుకు



సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. చివరి రోజు రాత్రింబవళ్లు గణపతి నవరాత్రి ఉత్సవాలలో నిర్విరామంగా పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గణపతి ఉత్సవాలను పూర్తి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా పెనుగంగ వద్ద ఉట్నూర్ ఎఎస్పి రుత్విక్ సాయి కొట్టే , ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, అడిషనల్ ఎస్పీలు పి మౌనిక , బి సురేందర్ రావు, డిఎస్పీ ఎం వెంకట నర్సయ్య తో కలిసి నిమర్జనం ప్రక్రియను వేగవంతం చేసి సిబ్బందికి సూచనలు ఇస్తూ, నిమర్జనం పట్టణంలో పూర్తి చేయడం జరిగింది.



## శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ సందడి

**మంచిర్యాల, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
వేంపల్లిలోని మంచిర్యాల గార్డెన్‌లో శ్రీహర్ష డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ పార్టీని ఘనంగా నిర్వహించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ పల్లె భూమేష్ ప్రారంభించి విద్యార్థులు లక్ష్యసాధనతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెమెంటోలతో సత్కరించారు.

## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



**మంచిర్యాల, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, బీసీ అభివృద్ధి అధికారి నీరటి రాజేశ్వరి, కుల సంఘాల ప్రతినిధులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ ఆత్మగౌరవం కోసం నాటి దొరల పాలనను ఎదిరించిన ఐలమ్మ ధైర్యసాహసాలు నేటి తరాలకు ఆదర్శమన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం ద్వారా వారి త్యాగాలు, ఆశయాలు, పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు చేరుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏకలవ్య ఆర్చరీ కోచింగ్ సెంటర్‌ను సందర్శించిన మాధవి లత





**తెల్లాపూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెల్లాపూర్‌లోని ఏకలవ్య ఆర్చరీ కోచింగ్ సెంటర్‌ను బీజేపీ సీనియర్ నేత మాధవి లత కొంపెల్ల సందర్శించారు. ఆర్చరీ శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో మాట్లాడి వారి శిక్షణ, ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యువత క్రీడల్లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బానిస సంకెళ్లను తెంచిన వీరవనిత చాకలి ఐలమ్మ



**నర్సంపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీకగా నిలిచారని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ అన్నారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ భూమి, భుక్తి, బహుజనుల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేలపట్లలో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య సదస్సు



**చౌటుప్పల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: నేలపట్ల గ్రామంలో పాలకుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య సదస్సు నిర్వహించారు. 'వినీల ఆకాశం--స్వచ్ఛమైన గాలి' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి గౌడ్ విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు, గృహస్థులకు భగవద్గీత గ్రంథాలు అందజేశారు. ధర్మబద్ధమైన జీవనం పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు, సహ చట్టం జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్, సంఘ నాయకులు కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణ

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో అక్టోబర్ 8, 9 తేదీల్లో రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు డీపీఆర్‌వో విష్ణువర్ధన్ తెలిపారు. పత్రికా ప్రకటనల తయారీ, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, ఆధునిక పాత్రికేయ విధానాలు, వృత్తిపరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న జర్నలిస్టులు అక్టోబర్ 5లోపు డీపీఆర్‌వో కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. గరిష్టంగా 75 మందికి అవకాశం ఉంటుందని తెలిపారు.

## విద్యార్థులకు ఉచిత యూనిఫాంల పంపిణీ



**టేక్మాల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
టేక్మాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఉచిత యూనిఫాంలు పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ బాలమణి ధనుంజయ్ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, పాఠశాల హెడ్మాస్టర్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు



## ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం.. ఇద్దరు మృతి

**కీసర, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డుపై శనివారం కూలీలతో వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం టైర్ పేలి అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో 11 మందికి గాయాలయ్యాయి. మృతులను చెర్లపల్లికి చెందిన మంగీలాల్ (60), సురేఖ (40)గా పోలీసులు గుర్తించారు. కీసర నుంచి షామీర్‌పేట వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐలమ్మ 131వ జయంతి వేడుకలు ఘనంగా



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రిమ్స్ ఆసుపత్రి వద్ద వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, బిసి, ఇతర సంఘాల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలి



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జిల్లాలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ, వీఓ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులు, సర్పంచులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రారంభం కాని, మధ్యలో నిలిచిపోయిన పనులను పరిశీలించి అవసరమైన చోట ప్రత్యామ్నాయ నిధులతో పూర్తి చేయాలని సూచించారు. వీఓ భవనాలను అక్టోబర్‌లోగా, పెండింగ్ పనులను నవంబర్ 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ సర్పంచులు, కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ రాథోడ్ రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, పంచాయతీ రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈలు శివరాం, తనాజీ, ఇంజినీరింగ్ అధికారులు, వివిధ మండలాల సర్పంచులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా నివాళులు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి, ఆర్థిక సంస్కరణలకు మన్మోహన్ సింగ్ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన నిరాడంబరత, నిజాయితీ, దేశసేవ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి , జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు అంబకంటి అశోక్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ బండి దేవదాస్ చారి, డిసిసి ఆఫీస్ ఇంచార్జ్ గౌలి సంజీవ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇన్చార్జ్ బెజ్జంకి అనిల్ కుమార్ , అదిలాబాద్ కాంగ్రెస్ సెక్రటరీలు ఇమ్రాన్ బేగ్, సిరాజుద్దీన్, ఆదిలాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ నహిద్,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ సామా రూపేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి



**వీణవంక, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మండలంలోని వల్బపూర్ యాదవ కురుమలు గొర్రెల పెంపకందారుల జిల్లా సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. గొర్రెలు, మేకలకు 85 శాతం బీమా సబ్సిడీ కల్పించడంపై మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీసీ రుణాలు మాఫీ చేయాలని, 50 ఏళ్లు దాటిన గొల్లకురుమలకు పెన్షన్ ఇవ్వాలని, గొర్రెల మేత కోసం ఐదు ఎకరాల భూమి కేటాయించాలని మంత్రులను కోరారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొర్రెల పెంపకం దారుల అధ్యక్షులు రాజాకొమురయ్య ఉప అధ్యక్షులు బొంకురి రవి ప్రధాన కార్యదర్శి న్యాలీ ఉమేష్ సతీష్ రాజకుమార్ మాజీ అధ్యక్షులు న్యాలీ సంపత్ యాదవ్ వార్డ్ సభ్యులు న్యాలీ రాజు బావు రాకేష్ మాజీ ఉప సర్పంచ్ కాసాని శ్రీను మాజీ వార్డ్ మెంబెర్స్ పల్లెవెన కుమార్ నరేంగుల సదయ్య ఉడుత సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు ముస్తఫాకు ఘన సన్మానం



**పెద్దపల్లి : సెప్టెంబర్,26(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ ముస్తఫాను అంతర్గాం మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ గౌస్ పాషా మర్యాదపూర్వకంగా కలిసి పట్టు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు దిటి బాలురాజు, కార్పొరేటర్ గట్ల రమేష్, ధూళికట సతీష్, దరగుల కుమార్, ఫజల్ అలీ, మొహెద్ సనీ, ఇదునూరి హరి ప్రసాద్, శివరాత్రి గంగాధర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ పథకాలపై సమీక్ష



**పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: అసెంబ్లీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన బీసీ వెల్ఫేర్ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీసీ సంక్షేమ పథకాలు, బీసీల అభ్యున్నతికి చేపడుతున్న కార్యక్రమాలపై సభ్యులతో చర్చించారు. పథకాలు అర్హులకు మరింత ప్రయోజనం చేకూరేలా అమలు చేయడం, తదుపరి చర్యలపై సమీక్షించారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, రామారావు పవార్, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ వేడుకల్లో రాజకీయ రసాభాస



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి)**
: కరీంనగర్ జిల్లా కేంద్రంలో అధికారికంగా నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. వేడుకల ఏర్పాట్లలో జాప్యంపై బీజేపీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించి వెళ్లిన అనంతరం మాటల సందర్భంగా వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో ఓ కాంగ్రెస్ కార్యకర్తపై బీజేపీ శ్రేణులు దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఘటనపై కుల సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహనీయుల వేడుకలను రాజకీయ ఘర్షణలకు వేదికగా మార్చవద్దని కోరారు.

## రూ.63 వేల లంచం తీసుకుంటూ మెట్‌పల్లి సీడీపీఓ ఏసీబీకి చిక్కిన వైనం

**మెట్‌పల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దరోజు పద్మ రూ.63 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. శనివారం సాయంత్రం మెట్‌పల్లి పట్టణంలోని ఓ ప్రదేశంలో ఏసీబీ కరీంనగర్ యూనిట్ అధికారులు నిర్వహించిన ట్రాప్‌లో ఆమె పట్టుబడ్డారు.



### 21 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి వసూళ్ల ఆరోపణ

మెట్‌పల్లి పట్టణ సెక్టార్ పరిధిలోని 21 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఒక్కో కేంద్రానికి నెలకు రూ.1,000 చొప్పున మూడు నెలలకు సంబంధించిన రూ.63 వేల మొత్తాన్ని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించగా అధికారులు ముందస్తు ప్రణాళికతో ట్రాప్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏసీబీ అధికారుల ప్రకారం, పద్మ లంచం స్వీకరిస్తున్న సమయంలో ఆమెను పట్టుకున్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేకరి):**
చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను వివేకానందనగర్‌లోని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ నివాసంలో ఘనంగా నిర్వహించారు. తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, రజక సంఘం నాయకులు, సభ్యులతో కలిసి గాంధీ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ఐలమ్మ తెగువ తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీక అన్నారు. ఆమె ధైర్యసాహసాలు మహిళలకు, సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి



**హుస్నాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ఆర్‌సీ)**
: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధుల నివారణకు సహకరించాలని 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ సూచించారు. శనివారం వార్డులో నిర్వహించిన స్వచ్ఛత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు తదితరాల్లో నీటిని తొలగించాలని సూచించారు. తాగునీటి ట్యాంకులు, డ్రమ్ములకు మూతలు పెట్టుకోవాలని, చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండు లక్ష్మి, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## దేవరకొండలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**దేవరకొండ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.వి.టి., గౌరవాధ్యక్షుడు కే. పంతులాల్ నాయక్, సభ్యులు, విద్యార్థులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. భూస్వాములు, రజాకార్ల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొన్న ఆమె ఆశయాలను నేటి తరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, కౌన్సిలర్ సాయి చంద్రగౌడ్, క్రీడాకారులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ మరమ్మతులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
33/11 కేవీ రంగంపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా సెప్టెంబర్ 27న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అదనపు సహాయ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ అంతరాయం పెద్దబొంకూర్, పెద్దకల్వల, నిట్టూర్, పెద్దపల్లి, రంగంపల్లి, నిమ్మనపల్లి ప్రాంతాల్లో ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు అసౌకర్యాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

## నేలపట్లలో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య సదస్సు



**చౌటుప్పల్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
: చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో పాలకుర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ ఆరోగ్య సదస్సు నిర్వహించారు. 'వినీల ఆకాశం--స్వచ్ఛమైన గాలి' అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి గౌడ్ విద్యార్థులకు నీతి కథల పుస్తకాలు, గృహస్థులకు భగవద్గీత గ్రంథాలు అందజేశారు. ధర్మబద్ధమైన జీవనం పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త బడుగు శ్రీరాములు, సహ చట్టం జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్, సంఘ నాయకులు కమలాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## డ్రైనేజీ నిర్మాణ పనులను అడ్డుకున్న స్థానికులు

**వేములవాడ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: పట్టణంలోని మూలవాగు నుంచి శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం వరకు చేపట్టిన 80 ఫీట్ల రహదారి విస్తరణలో భాగంగా జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను మహంకాళి ఆలయం సమీపంలోని స్థానికులు శనివారం అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కాలువ నిర్మిస్తున్నారని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్సై శ్రీనివాస్ ఘటనాస్థలికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. రోడ్డు మధ్య నుంచి 35 అడుగులు వదిలి డ్రైనేజీ నిర్మించాలని, ప్రస్తుతం తమ ఇళ్ల వద్ద చేపడుతున్న నిర్మాణంతో స్థలం కోల్పోయే పరిస్థితి ఉందని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్సై హామీ ఇచ్చారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
పెద్ద శంకరంపేట పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుమలాపూర్ చెరువు కట్ట వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నారా గౌడ్, మురళి పంతులు, సుభాష్ గౌడ్, దాచ సంగమేశ్వర్, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు పెరుమాండ్ల గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు వెంకట్రావు, గాజు కుమార్, ప్రశాంత్ రెడ్డి, మండల రజక సంఘం అధ్యక్షుడు చాకలి ప్రభు, బాధ్యులు వెంకటేశం, కిష్టయ్య, లక్ష్మణ్, సాయి, నరేష్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి



**వేములవాడ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో వీరవనిత చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు తెలంగాణ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి బీసీ నేత పొలాస నరేందర్, రజక సంఘం నేత లింగంపల్లి దేవయ్యతో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొలాస నరేందర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ బడుగు, బలహీన వర్గాల హక్కులు, మహిళా సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ నేతలు కనపర్తి సుధాకర్, బొజ్జ రమేష్, చింతలకోటి రామస్వామి గౌడ్, మొగిలి అంజయ్య, నేరేళ్ళ నర్సయ్య, శబాస్ పేల్లి బాలమల్లు, కుంభం రవి, వట్టేముల పాట దేవయ్య, అద్దంకి సత్తయ్య, డి. చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
అంతర్గాం మండలంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి లక్ష్మణ్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.




ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని అన్నారు. సామాజిక న్యాయం, హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## బీటి రోడ్డు పనులు చేపట్టాలి.

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని సత్తక్కపల్లి,ఎర్రపూర్, డబ్బా,వర్షకొండ గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారిందని ద్విచక్ర వాహనాలు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ను కోరారు .ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నిధులు మంజూరు చేయవలసింది కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి,బీసీ సెల్ మండల అధ్యక్షుడు భూస రాజేశ్వర్ పాల్గొన్నారు.

## మెదక్‌లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ప్రారంభం




**మెదక్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మెదక్ మార్కెట్‌యార్డులో నూతనంగా నిర్మించిన కేంద్రీకృత వంటశాలను మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. మంత్రి మాటాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడమే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ఉద్దేశమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 కేంద్రీకృత వంటశాలలు ఏర్పాటు చేశామని, సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. మెదక్‌లో వచ్చే ఏడాది 2,500 మంది విద్యార్థుల సామర్థ్యంతో యంగ్ ఇండియా స్కూల్ ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, హెచ్‌కెఎంసిఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులు సాంకేతిక పద్ధతులను పాటించాలి




**మెదక్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని కార్మిక, గనుల భూగర్భ శాఖ మంత్రి, మెదక్ ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. మెదక్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళాలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుతో కలిసి పాల్గొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాల ఎంపిక, సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ, నీటి పొదుపు, యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, అధికారులు, శాస్త్రవేత్తలు, ఎఫ్‌పీవోలు, రైతులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశంలో అభివృద్ధికి దిశానిర్దేశం



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. శనివారం ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీల ఆర్థిక పరిస్థితికి అనుగుణంగానే అభివృద్ధి పనులు చేపట్టాలని, ప్రజాధనం వృథా చేయొద్దని ఎమ్మెల్యే సూచించారు. పాఠశాలల నిర్వహణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. యాదవులపల్లిలో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ వచ్చే విద్యాసంవత్సరానికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అనంతరం 45 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు.

## ఎల్లమ్మ చెరువును సందర్శించిన విద్యార్థులు



**హుస్నాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ఆర్‌సీ):**
శ్రీ అపోలో వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రలో భాగంగా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువును సందర్శించారు. చెరువు సుందరీకరణ పనులతో పాటు నిర్మాణంలో ఉన్న గాజు వంతెనను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గణేష్ వేముల మాట్లాడుతూ సుందరీకరణ పనులు, గాజు వంతెన పూర్తయితే హుస్నాబాద్ ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమనపల్లిలో ఘనంగా పోషణ మాసం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
అంతర్గాం మండలం సోమనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసం కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ శేషికళ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ గుంట బాపు, ఉప సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు ఏర్రోజు సత్యనారాయణ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పౌష్టికాహారం, పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 22 మంది జ్వర బాధితులు, 15 మంది బీపీ, 10 మంది షుగర్ బాధితులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లత, ఆశా వర్కర్ రత్నాకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇప్పుడే కష్టపడండి.. భవిష్యత్తును ఆనందంగా మలుచుకోండి





**జమ్మికుంట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యార్థి దశలోనే భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని, విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, మంచి నడవడిక అవసరమని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో ఆయన పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్మీడియట్ కీలక దశ అని, ఇప్పుడే కష్టపడి లక్ష్య సాధనకు కృషి చేస్తే భవిష్యత్తు ఆనందంగా ఉంటుందని అన్నారు. చెడు వ్యసనాలు, అలవాట్లకు దూరంగా ఉండి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో సత్యనారంజనేయ, కళాశాల ప్రిన్సిపల్ ఎం. కుమార్, శశిధర్ శర్మ, సుగుణ, జ్యోత్స్నాదేవి, తిరుపతి, విశ్వనాథ్ రెడ్డి, మహేశ్, ప్రభాకర్, రమేష్, శ్రీనివాస్ తదితర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణలో రివర్స్ టూరిజం-ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్‌కు శ్రీకారం



: తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లను విస్తృతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రకృతి, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంపదకు నిలయమైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. శనివారం శిల్పారామంలోని సాంప్రదాయ వేదికలో ప్రపంచ పర్యాటక దినోత్సవం– –2026 వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భట్టివిక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ?ఈ ఏడాది పర్యాటక దినోత్సవ ఇతివృత్తమైన డిజిటల్ అజెండా -- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పర్యాటక రంగానికి కొత్త రూపు ప్రాధాన్యతను వివరిస్తూ, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మన పర్యాటక రంగాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో హెల్త్, ఆలయ, గ్రామీణ, ప్రకృతి పర్యాటక రంగాలకు అపారమైన అవకాశాలున్నాయని, వికారాబాద్‌లో వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రశాంతతను కోరుకునే వారికి తెలంగాణ సరైన వేదిక అని, వీటిని అంతర్జాతీయంగా సరైన రీతిలో మార్కెటింగ్ చేయాలని అధికారులకు ఆయన

## ఐలమ్మ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



**ధర్మారం, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నంది మేడారంలో ఆమె విగ్రహానికి అడ్వకేట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు అకారి రాజేశం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దేవి రాజలింగు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అకారి రాజేశం మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మారం గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎడపెల్లి సంతోష్, సల్వాజి మాధవరావు, రజక సంఘం అధ్యక్షుడు అర్ధవెల్లి రాము, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ధర్మపురి నియోజకవర్గ ఇన్చార్జి అమరపెల్లి నారాయణ, భారతీయ జనతా పార్టీ నాయకులు వన్నెల బాలిరెడ్డి, కుంట రాజిరెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, గుండేటి శ్రీనివాస్ సుధాకర్, విద్యా మారి రాజేందర్, వార్డు సభ్యుడు దేవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి



**నల్లగొండ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం రజాకారులను ఎదిరించి పోరాడిన వీరవనిత ఐలమ్మ మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా మహిళా డిగ్రీ కళాశాలకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం వ్యవస్థాపక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కట్టెల శివకుమార్, సెంట్రల్ కమిటీ మెంబర్ కొండేటి నరేష్ కుమార్,రాష్ట్ర కార్యదర్శిలు బందారు శంకర్ కమ్మల నరేష్ కుమార్, సంఘం గౌరవ సలహాదారులు కందుల విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ అదిమల్ల లింగయ్య, పెన్షనర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్కే జానిమియా, జిల్లా నాయకులు ఈరిగి బిక్షం కొండన్న, సుధీర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సమానత్వం కోసం పోరాడిన వీరవనిత ఐలమ్మ



**నల్లగొండ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భూమి, సమానత్వం కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా నాగార్జునసాగర్ రోడ్డులోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ్‌ముఖ్‌లకు ఎదురొడ్డి పేదల భూమి కోసం పోరాడిన ఐలమ్మ దొరల గడీలను ఎదిరించి సమానత్వం కోసం కృషి చేశారని తెలిపారు. ఆమె పోరాట పటిమ, ప్రజా సంక్షేమం కోసం చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలోని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్, బీసీ సంక్షేమ అధికారి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యాలయంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, కార్యాలయ సిబ్బంది, తదితరులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## వినాయక పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేకరి):**
కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ సి–బ్లాక్‌లో కేఆర్‌ఆర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ గణపతి మహిళా స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. గణేష్ ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చాంద్ బాషా, జగదీశ్వర్ గౌడ్, మారబోయిన రవి యాదవ్, యాంకర్ ప్రదీప్, ఉత్సవ సమితి సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రంజోల్ కాలనీలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**జహీరాబాద్, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రంజోల్ కాలనీలో రజక సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ అధ్యక్షుడు, శాంతి ఫౌండేషన్ చైర్మన్ సిద్దు రావణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిద్దు రావణ్ మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, అన్యాయానికి వ్యతిరేకంగా అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ పట్టణ అధ్యక్షులు అలీమ్ హుస్సేన్, నాయకులు రాములు, విజయ్ కుమార్, ఆగమయ్య, బలరాం, బాల్రాజ్, రజక సంఘం నియోజకవర్గ నాయకులు వెంకటేశం, పెంటన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





## గుండ్లపల్లిలో మండల సమీక్ష సమావేశం

**డిండి, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండలం గుండ్లపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి పి. కమలాకర్‌రెడ్డి అధ్యక్షతన, ఎంపీడీవో నర్రా వేణ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మండలంలోని వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులు సమీక్షించారు. సమావేశంలో ఎంపీవో ఐసీ గౌరటి జంగయ్య, ఏపీవో శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జనగామ: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ పాలన సాగుతోందని తెలంగాణ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (గ్రాశీఅస్త్రబశ్రీవీఱ ాతీఱఅఱఖుం =వ.ఎ.ఎ) అన్నారు. జనగామలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దసరా నాటికి 2,18,000 ఇళ్లు పూర్తవుతాయన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కేవలం కొన్ని నియోజకవర్గాలకే ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పేదల కోసం పని చేస్తుందని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను కూడా కొనసాగిస్తున్నామని శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.



## పిన్నింటి హన్మాండ్లును పరామర్శించిన బండి సంజయ్

**వేములవాడ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి, శ్రీరాజరాజేశ్వర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు పిన్నింటి హన్మాండ్లు అక్క ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హన్మాండ్లుకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటానని, ఢిల్లీ నుంచి వచ్చిన అనంతరం స్వయంగా కలుస్తానని బండి సంజయ్ తెలిపారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు కూడా ఫోన్ చేసి పరామర్శించారు. వ్యాపారుల సంఘం సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

## విద్యార్థులకు బూట్ల పంపిణీ



**రాజాపేట, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి విలేకరి):**
నెమిల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం సర్పంచ్ పులి రాజు బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే దేశ భవిష్యత్తు నిర్మాతలని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రతి చిన్నారికి ఓర్పుతో నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మార్క శివ కుమార్, ప్రధానోపాధ్యాయులు నమిల భరత్ కుమార్, కందుల మమత, మంత్రి నాగరాజు, మేక సాయి కృప, రజిత పాల్గొన్నారు.

## ‘చలో హైదరాబాద్’ సభను విజయవంతం చేయాలి



**దేవరకొండ, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కాన్షీరాం వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ‘చలో హైదరాబాద్’ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కామేపల్లి సైదులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దేవరకొండలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఎస్పీ నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జి నల్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాన్షీరాం ఆశయాలు, బహుజన సమాజం కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ నిర్వహిస్తున్న సభకు ప్రజలు, బహుజన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గ్యార సతీష్ (అడ్వకేట్), పల్లె కిరణ్ కుమార్, దున్న బాలకృష్ణ, ప్రకాష్, భరత్ తదితర బహుజన సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాటం నేటి తరానికి అనుసరణీయం



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 26 (తెలంగాణ వాణి):**
చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా పటాన్‌చెరు డివిజన్‌లోని రజక సంఘం భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేసేలా వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, రజక సంఘం అధ్యక్షులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## చిట్టీల పేరుతో రూ.10 కోట్లు వసూలు.. పరారీలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు

సూర్యాపేట: ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.10 కోట్ల చిట్టీ డబ్బులతో పరారైన ఘటన సూర్యాపేట(ాబతీఖుజూవ్) జిల్లాలో కలకలం రేపింది. ఆత్మకూర్ (ఎస్) మండలం శెట్టిగూడెం ప్రభుత్వ పాఠశాలలో భానోత్ రాజు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. చిట్టీల పేరుతో చివ్వెంల మండలం లక్ష్మీనాయక్ తండా, బోట్య తండా, ఏనెగంటి తండా, శెట్టిగూడెం, పిల్లలమర్రి తదితర గ్రామాల్లో వందలాది మంది నుంచి దాదాపు రూ.10కోట్లు వసూలు చేశాడు. పది రోజులుగా ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. శనివారం సూర్యాపేట జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. బంధువుల నుంచే రాజు రూ.2కోట్లు వసూలు చేసినట్టు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మాతృభూమి రక్షకుడు



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'రణబాలి' దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా విడుదల వాయిదా పడుతుందనే వార్తలకు చెక్ పెడుతూ చిత్రబృందం శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది.తన మాతృభూమిని, ప్రజల్ని కాపాడేందుకు ప్రతిజ్ఞబూనిన వీర యోధుడు రణబాలిగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో పోస్టర్ ఆకట్టుకుంటున్నది. 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనాకాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్-అతుల్, కథ, దర్శకత్వం: రాహుల్ సంకృత్యాన్.

## ప్రపంచంతో పోరాడుతా!



వివాహం తర్వాత మానసికంగా దృఢంగా మారారు రష్మిక మందన్నా. ఆమె ఎక్కడ మాట్లాడినా ఆ మాటల్లో ఓ పరిపూర్ణత్వం గోచరిస్తున్నది. తాజాగా ఇంటి ఇల్లాలుగా తన బాధ్యతల గురించి అద్భుతంగా మాట్లాడారామె. 'నా కుటుంబం అభ్యున్నతే నాకు ముఖ్యం. ఇప్పుడు ఇల్లాలిని మాత్రమే. త్వరలో తల్లిని కూడా అవుతా. అప్పుడు నా పిల్లల భద్రత కోసం, వారి సంతోషం కోసం అవసరమైతే ప్రపంచంతో పోరాడతా. నా కుటుంబానికి అందాల్సిన ప్రశాంతత, భద్రత విషయంలో రాజీపడను. మానవ సంబంధాలు, భావోద్వేగ అనుబంధాలకే నా ప్రథమ ప్రాధాన్యత' అని రష్మిక పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## రామ నారాయణం జానకీ వల్లభం



దేశమంతా ఎదురు చూస్తున్న చిత్రాల్లో నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణం' ఒకటి. ఇందులో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దాదాపుగా మూడువేల కోట్ల నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రం దీపావళి కానుకగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ సినిమా సంగీత ప్రయాణాన్ని షురూ చేశారు. సినిమాలోని తొలి పాట 'జై జై రామ్..' తెలుగు వెర్షన్‌ని శుక్రవారం విడుదల చేశారు.'అచ్యుతం కేశవం.. కృష్ణ దామోదరం.. రామ నారాయణం జానకీ వల్లభం..' అంటూ సాగే ఈ భక్తిరసాత్మక గీతాన్ని రాకేందు మౌళి రాయగా, ఏఆర్ రెహ్మాన్ స్వరపరిచారు. దీపాలి సహాయ్, రాఘవ్ కౌశిక్ ఆలపించారు. సినిమా నుంచి విడుదలైన ఈ తొలిపాట కథలోని ఆత్మను ప్రతిబింబిస్తుందని చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రా చెప్పారు. ప్రార్థనలోని స్వచ్ఛత, ఆత్మీయతకు ప్రతిరూపం ఈపాట అని ఏఆర్ రెహమాన్ అభిప్రాయపడ్డారు. భక్తుడికి రాముడితో ఉన్న అనుబంధాన్ని వ్యక్తీకరించే పాట ఇదని గీత రచయిత రాకేందు మౌళి చెప్పారు.

# సిగ్మా సక్సెస్ కావడం ఖాయం



'ఎవరిమాటా వినని వాడ్ని 'సిగ్మా' అంటారని తెలిసింది. ఇది నిజంగా న్యూ థాట్. ట్రైలర్ చూస్తే సినిమా చూడాలనిపిస్తుంది. సక్సెస్ ఖాయం. ఈ వేడుకకు రావడానికి కారణం సందీప్‌కిషన్. తను నా కుటుంబసభ్యుల్లో ఒకడు. విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ డైరెక్షన్‌లో సినిమా అనగానే.. వాళ్ల తాత ఎస్.ఏ.చంద్రశేఖర్ గుర్తొచ్చారు. ఆయన దర్శకత్వంలో చట్టానికి కళ్లులేవు, దేవాంతకుడు వంటి మంచి సినిమాలు చేశాను. ఆయన మనవడు సినిమా అనగానే రాకుండా ఉండలేకపోయా. వాళ్ల నాన్న విజయ్‌లా సంజయ్ కూడా గొప్ప స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నా.

ఈ సినిమా సందీప్‌కిషన్‌కి బ్లాక్‌బస్టర్‌గా నిలవాలి' అని అగ్ర కథానాయకుడు చిరంజీవి ఆకాంక్షించారు. సందీప్‌కిషన్ హీరోగా జేసన్ సంజయ్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ అడ్వెంచర్ 'సిగ్మా'. ఫరియా అబ్దుల్లా కథానాయిక. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 2న విడుదల కానున్నది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి మాట్లాడారు. జేసన్ సంజయ్ మాట్లాడుతూ 'ఇది యాక్షన్ అడ్వెంచర్. కొత్త ఎలిమెంట్స్ ఉంటాయి. ట్రెజర్ హంట్ మూవీ ఇది. సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుంది. నన్ను, నా విజన్‌ని నమ్మినందుకు సందీప్‌కి థ్యాంక్స్. ప్రేక్షకుల స్పందన కోసం ఎదురు చూస్తున్నా' అని పేర్కొన్నారు. 'మమ్మల్ని నమ్మి ఇంత ఖర్చుపెట్టిన లైకా సంస్థకు కృతజ్ఞతలు. డైరెక్టర్‌గా జేసన్ సంజయ్ డెబ్యూ మూవీకి నేను హీరో అనగానే నమ్మలేకపోయా. 70 రోజుల్లో అద్భుతంగా సినిమా తీశాడు తను. గోల్డ్ స్పూన్‌తో పుట్టినా.. స్వయంకృషితో ఎదగాలని తపించే 24ఏండ్ల కుర్రాడు తీసిన సినిమా ఇది' అని హీరో సందీప్‌కిషన్ చెప్పారు. ఇంకా ఫరియా అబ్దుల్లా, చోటా కె.నాయుడు, తమన్, మిర్చి సంపత్ తదితర చిత్రబృందంతోపాటు నవీన్ యర్నేని, లగడపాటి శ్రీధర్, ఎస్‌కేఎన్, సాయిరాజేశ్ తదితరులు కూడా మాట్లాడారు.

## ఆత్మగౌరవ ప్రతీక



ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న చిత్రం 'గరివిడి లక్ష్మి'. ఆనంది టైటిల్ రోల్‌ని పోషిస్తున్నది. గౌరి నాయుడు జమ్ము దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు.

బుర్ర కథలను ఓ ఉద్యమంగా మార్చి గ్రామీణ ఆత్మగౌరవానికి ప్రతీకలా నిలిచిన గరివిడి లక్ష్మి జీవితానికి సెల్యూట్ లాంటి సినిమా ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం నుంచి 'కొండ కోన' అనే పాటను విడుదల చేశారు. అక్టోబర్ 17న ఈ సినిమా విడుదలకానుంది. ఈ చిత్రానికి సంగీతం: చరణ్‌అర్జున్, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్, దర్శకత్వం: గౌరీ నాయుడు జమ్ము.

# విమల్ కృష్ణ టేకింగ్, రాగ్ మయూర్ నటన ఎలా ఉంది..




'డిజె టిల్లు' వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు విమల్ కృష్ణ తెరకెక్కించిన తాజా చిత్రం 'అనుమాన పక్షి'. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కథాకథనాలు ఎలా ఉన్నాయో సమీక్షలో చూద్దాం.

కథేంటంటే: సన్నీ (రాగ్ మయూర్) 'అనుమాన పక్షి' పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నడుపుతుంటాడు. ప్రతి విషయాన్ని అతిగా ఆలోచించడం, అందరినీ అనుమానించడం అతని నైజం. ఈ క్రమంలో తన స్నేహితుడు అనంతు డిప్రెషన్‌లో ఉన్నానని, కాశ్మీర్‌లో ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్ చేస్తాడు. దాంతో సన్నీ, రమ్య అనే అమ్మాయిని ఇష్టపడే వర్మ (ప్రిన్స్) సహాయంతో కాశ్మీర్ బయలుదేరుతాడు. అక్కడ కన్య (మెరిన్ ఫిలిప్) పరిచయమవ్వడం, అనుకోకుండా వర్మ హత్యకు గురికావడం, రీల్స్ చేయడానికి పిచ్చిగా ప్రయత్నించే పోలీస్ ఆఫీసర్ వాసు (అజయ్) ఎంట్రీ ఇవ్వడం జరుగుతుంది. వీరందరి మధ్య సంబంధం ఏమిటి? ఈ చిక్కుముడిని సన్నీ ఎలా విప్పాడు? అనేదే ఈ చిత్ర అసలు కథ.

విశ్లేషణ: దర్శకుడు విమల్ కృష్ణ ఎంచుకున్న పాయింట్ చాలా కొత్తగా ఉంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే హీరో పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు విభిన్నంగా నవ్విస్తాయి. ప్రథమార్ధంలో హీరో చేసే అల్లరి, సిచ్యుయేషనల్ కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక ద్వితీయార్ధంలో అజయ్ పోలీస్ ఆఫీసర్‌గా చేసిన హంగామా, రీల్స్ కాన్సెప్ట్ ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా సరదాగా సాగుతాయి. స్క్రీన్‌ప్లేలో సస్పెన్స్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తాయి.

నటీనటుల ప్రతిభ: లీడ్ రోల్ చేసిన రాగ్ మయూర్ తన అనుమానాలతో కూడిన పాత్రలో చాలా సహజంగా నటించాడు. మంచి టైమింగ్‌తో నవ్వులు పూయించాడు. తెలుగు తెరకు పరిచయమైన మెరిన్ ఫిలిప్ తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో మెప్పించింది. ప్రిన్స్, అజయ్ తమ పాత్రల పరిధి మేరకు చక్కటి నటన కనబరిచారు.

సాంకేతిక నిపుణులు: సాంకేతికంగా సినిమా రిచ్‌గా ఉంది. కాశ్మీర్ అందాలను సినిమాటోగ్రఫీ చాలా అద్భుతంగా క్యాప్చర్ చేసింది. నేపథ్య సంగీతం సినిమా మూడ్‌కు సరిగ్గా సరిపోయింది. నిర్మాణ విలువలు బాగున్నాయి.

అంతిమ తీర్పు (దీశీశీఎ ాఱఅవ): కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు 'అనుమాన పక్షి' మంచి ఛాయిస్ అవుతుంది.

## 'కాకా' డబ్బింగ్ షురూ



అగ్ర నటుడు చిరంజీవి 'కాకా' చిత్రం జనవరి 13న సంక్రాంతి బరిలో ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. ఫ్యామిలీ, యాక్షన్ అంశాల కలబోతగా పవర్‌ఫుల్ కథాంశంతో దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది. ఈ చిత్రంలో చిరంజీవి కదిరి కాళిదాస్‌గా కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం ఓ వీడియోను షేర్ చేసింది. షూటింగ్‌తో పాటు పోస్ట్‌ప్రొడక్షన్‌ను సమాంతరంగా నిర్వహిస్తున్నామని, త్వరితగతిన అన్ని కార్యక్రమాల్ని పూర్తి చేసి ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్, సునీల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్,

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com